క్లుప్తంగా

ఆదిత్యాలయ అభివృద్ధికి రూ.1.11 లక్షల విరాళం



ఈవో ప్రసాద్‌కు చెక్ అందజేస్తున్న దాతలు

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ అభివృద్ధికి జిల్లాకు చెందిన ఎస్.వి.సతీష్, ఎస్.వి.ఎస్.పావని, ఎస్.వి.సూర్యప్రకాష్ కుటుంబసభ్యులు రూ.1,11,111 విరాళాన్ని శనివారం చెక్కు రూపంలో అందజేశారు. కార్యక్రమంలో ఈవో కె.ఎస్.వి.డి.వి.ప్రసాద్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ జెడ్పీటీసీ సభ్యుడికి పరామర్శ



పరామర్శకు హాజరైన గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: పాతర్లపల్లి గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ సభ్యుడు గొర్లె లక్ష్మణరావు శుక్రవారం రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. శ్రీకాకుళంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శనివారం పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సనపల నారాయణరావు, లావేరు జెడ్పీటీసీ మీసాల సీతంనాయుడు తదితరులు ఉన్నారు.

రంగస్థల కళాకారుల నూతన భవనం ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం కల్చరల్: ఎస్పీ బంగ్లా రోడ్డులో నిర్మించిన శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య నూతన భవనాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్ శనివారం ప్రారంభించారు. అనంతరం నటరాజ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాకారుల కోసం సంపూర్ణ సహకారం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ సచివాలయ సిబ్బంది, రిటైర్డ్ ఆర్డీఓ పి.ఎం.జె.బాబు, కళాకారుల సమాఖ్య సభ్యులు ఎల్.రామలింగస్వామి, పన్నాల నర్సింహమూర్తి, రామచంద్రదేవ్, చిట్టి నాగభూషణం, రమణారావు, కవ్వాడి సుశీల, జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పి.వి.నర్సింహారావు సేవలు చిరస్మరణీయం



పి.వి.నరసింహారావు చిత్రపటం వద్ద నివాళులు అర్పించిన కాంగ్రెస్ నాయకులు

శ్రీకాకుళం అర్బన్: దివంగత ప్రధాని పి.వి.నరసింహారావు దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు, జిల్లా ఇన్‌చార్జి గాదం వెంకట త్రినాథరావు అన్నారు. శనివారం శ్రీకాకుళంలోని ఇందిరా విజ్ఞాన్‌భవన్‌లో పి.వి.నరసింహారావు జయంతి ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు ఏఐసీసీ, పీసీసీ పిలుపు మేరకు పాతబస్టాండ్ కూడలి వద్ద బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాజ్యాంగాన్ని పరిరక్షించాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు ధర్నా చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కేవీఎల్ఎస్ ఈశ్వరి ఇజ్జురోతు రమణ, మామిడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా రాణించాలి

శ్రీకాకుళం: స్వయం సహాయక సంఘాల మహిళలు ఎంఎస్‌ఎంఈలుగా రాణించాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకరరావు పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని రైతుబజార్ వద్ద పట్టణ మహిళా సామాజిక వనరుల భవనంలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. మహిళలు పారిశ్రామికంగా ఎదిగేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం మెప్మా రిసోర్సుపర్సన్లకు ట్యాబ్‌లు, బయోమెట్రిక్ డివైస్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెప్మా పీడీ ఎస్.వి.రమణ, సీనియర్ అసిస్టెంట్ ఏ.వెంకటరావు, నాయకులు పాల్గొన్నారు.

ఎనిమిది మంది పేకాటరాయుళ్ల అరెస్టు

ఎచ్చెర్ల : తమ్మినాయుడుపేట సమీపంలో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి ఆరు సెల్‌ఫోన్లు, రూ.68,180 నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరంతా తమ్మినాయుడుపేట, సమీప గ్రామాలకు చెందినవారని పోలీసులు తెలిపారు.

- 45 రోజులుగా మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బంది సమ్మె
- ఉద్యోగ భద్రత, వేతన పెంపునకు డిమాండ్
- కనీసం పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- సమస్యలు పరిష్కారం కాక నగరవాసుల అవస్థలు



నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బంది (ఫైల్)

ఇంకెన్నాళ్లు!

శ్రీకాకుళం: తమ న్యాయమైన డిమాండ్లు తీర్చాలని కోరుతూ నగరపాలక, మున్సిపల్ సంస్థల్లోని ఇంజినీరింగ్ సిబ్బంది నలభై ఐదు రోజులుగా సమ్మె చేస్తున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. వీరు చేయాల్సిన పనుల కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించడంతో రిటైరైన ఉద్యోగులు, పంచాయతీల్లోని సిబ్బందిని నగరంలోకి తీసుకువచ్చినా వారికి అవగాహన లేక సకాలంలో మరమ్మతులు చేయలేకపోతున్నారు. దీంతో నగరవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వీధి లైట్ల సమస్య వెంటాడుతోంది. ఎప్పుడు ఏ వీధి చూసినా వీధిలైట్లు వెలగకుండానే కనిపిస్తున్నాయి. తాగునీటిదీ ఇదే పరిస్థితి. కుళాయిల ద్వారా సక్రమంగా నీరు సరఫరా కావడం లేదని నగరవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎలక్ట్రికల్, ప్లంబింగ్, వాటర్ వర్క్స్‌లో పనిచేస్తున్న సిబ్బంది సమ్మెలో పాల్గొనడమే దీనికి కారణం.

మాట తప్పిన ప్రభుత్వం..

తాము అధికారంలోకి వస్తే మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బందికి సంక్షేమ పథకాలు అమలుచేస్తామని ప్రకటించి మ్యానిఫెస్టోలో కూడా పొందుపరిచారు. అధికారంలోకి వచ్చిన తర్వాత అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల తల్లికి వందనం పథకాన్ని కూడా వీరికి వర్తింపజేయలేదు. ఇప్పటికే అరకొర వేతనాలు వస్తుండటంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుండగా ప్రభుత్వ పరంగా వస్తున్న సంక్షేమ పథకాలు వర్తింపచేయకపోవడం భావ్యం కాదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలన్నర రోజులుగా ఆందోళన చేస్తుండటంతో జీతాలు కూడా ఇవ్వకపోగా, తల్లికి వందనం పథకాన్ని కూడా వర్తింపజేయకపోవడంతో పిల్లల చదువులకు అప్పులు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు.

డిమాండ్లు ఇవే..

టెక్నికల్ సిబ్బందికి రూ.29,200, నాన్ టెక్నికల్ సిబ్బందికి రూ.24,500 జీతాలు చెల్లించాలని, హెచ్‌ఆర్ పాలసీ పరిధిలోకి తీసుకురావాలని, మినిమమ్ టైంస్కేల్ వర్తింపజేయాలని, 20 ఏళ్లుగా ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న వారికి సరీ్వసును బట్టి ఆరుశాతం ఇంక్రిమెంట్‌తో జీతం పెంచాలని, పదవీ విరమణ లబ్ధికింద కార్మికులకు చెల్లింపులు జరపాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేస్తున్నారు. అలాగే హెల్త్‌కార్డులు, ఏడాదికి 30 మెడికల్ లీవులు, క్యాజువల్ లీవులు అమలుచేయాలని కోరుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి నగర, పట్టణ ప్రజల అవస్థలను పరిగణనలోకి తీసుకొని న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కార్మికులు కోరుతున్నారు.



అంధకారమైన ప్రధాన రహదారి

చర్యలు తీసుకుంటున్నాం..



సమ్మెలో పాల్గొంటున్న వర్కర్ల స్థానంలో ప్రత్యామ్నాయ సిబ్బందిని నియమించాం. వారి ద్వారా సక్రమంగానే సేవలందుతున్నాయి. వాటిని మరింత మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. – ప్రసాదరావు, శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్

యువజన విభాగం అధ్యక్షుడికి అభినందనలు



బాలి శ్రీనివాసనాయుడును అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల: లావేరు మండల వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడిగా ఎంపికైన బాలి శ్రీనివాసనాయుడును మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శనివారం అభినందించారు. మురపాకలోని పార్టీ కార్యాలయానికి విచ్చేసిన కిరణ్ మాట్లాడుతూ పనిచేసిన వారికి పార్టీలో ఎల్లప్పుడూ గుర్తింపు లభిస్తుందన్నారు. యువతతో మమేకమై పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మీసాల సీతంనాయుడు, పెయ్యిల లక్ష్మణరావు, వండాన సిమ్మినాయుడు, మీసాల అప్పారావు, ఎన్ని ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు గ్రామంలో జగన్నాథుని ఆలయంలో రథయాత్ర ఉత్సవాలు సందర్భంగా స్వామివారిని కిరణ్ దర్శించుకున్నారు. అర్చకులు శ్రీకాంత్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జగన్నాథుడి అవతార వైభవం



గుజరాతిపెటలో వెంకన్న అవతారంలో జగన్నాథుడు



ఇలిసుపురంలో మత్స్యావతారంలో..



పొండ్రంగి వీధిలో రామావతారంలో..

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని గుజరాతిపేటలో జగన్నాథస్వామి దేవాలయం ఆధ్వర్యంలో జరుగుతున్న రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా స్వామివారిని శనివారం వెంకటేశ్వర స్వామిగా అలంకరించారు. అర్చకులు పెంట సోదరుల ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈఓ శ్యామలరావు ఏర్పాట్లు చేశారు. ఇలిసిపురం కూడలిలో జగన్నాథస్వామిని మత్స్యావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సుభద్ర, బలభద్ర, జగన్నాథులను భక్తులు దర్శించుకున్నారు. పొండ్రంగి వీధిలోని రామమందిరం వద్ద స్వామివారు రామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు వేదుల ప్రదీప్ శర్మ, ఆలయ ధర్మకర్తలో ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

స్వర్ణకార సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ ప్రతినిధులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం పట్టణ స్వర్ణకార సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈ మేరకు శనివారం ఓ ప్రవేటు ఫంక్షన్ హాల్‌లో ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. నూతన అధ్యక్షుడిగా సోపింటి తారకేశ్వరరావు, కార్యదర్శిగా కడారి దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షుడిగా కరిశెట్టి ఈశ్వరరావు, ట్రెజరర్‌గా తాళాబత్తుల సూర్యప్రకాశరావు, పలువురిని కార్యవర్గ సభ్యులుగా నియమించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ స్వర్ణకారుల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. అందరి సహకారంతో సంఘ సంక్షేమానికి పాటుపడతానని చెప్పారు.

రౌడీషీటర్లపై నిరంతర నిఘా



మాట్లాడుతున్న ఎస్పీ



నెలవారీ సమీక్షలో పాల్గొన్న పోలీసు అధికారులు

శ్రీకాకుళం క్రైమ్: ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో బీట్ సిస్టమ్‌ను పటిష్టంగా అమలు చేయాలని, శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా పాత నేరస్తులు, రౌడీషీటర్లపై పూర్తి నిఘా పెట్టాలని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం పోలీసు అధికారులతో నెలవారీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పబ్లిక్ గ్రీవెన్స్‌లో వచ్చే ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహించరాదన్నారు. గ్రామాలు, విద్యాసంస్థలను ఎప్పటికప్పుడు సందర్శించి మహిళల భద్రత, మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాలు, రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న గ్రేవ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, పోక్సో కేసుల్లో పారదర్శకంగా దర్యాప్తు ఉండాలని, నాన్‌బెయిల్‌బుల్ వారెంట్లు అమలుపర్చి న్యాయస్థానాల్లో ముద్దాయిలను హాజరుపర్చాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపినవారిపై కేసులు కట్టాలన్నారు. గంజాయి, మద్యం అక్రమ రవాణా అరికట్టాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీలు కె.వి.రమణ, పి.శ్రీనివాసరావు, డీఎస్పీలు సీహెచ్ వివేకానంద (శ్రీకాకుళం), వి.వి.అప్పారావు, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.17.35 లక్షలకు కొబ్బరిముక్కల వేలం



వేలం ప్రక్రియ నిర్వహిస్తున్న ఈవో ప్రసాద్

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో భక్తులు మొక్కులుగా చెల్లించిన కొబ్బరి ముక్కల వేలం రూ.17.35 లక్షలకు ఖరారయ్యింది. శనివారం ఆలయ మండపంలో ఈవో కె.ఎస్.వి.డి.వి.ప్రసాద్, రావివలస ఈవో గురునాథరావు సమక్షంలో నిర్వహించిన వేలంలో పెద్దపాడుకు చెందిన కలగ తిరుమలరావు టెండర్ దక్కించుకున్నారు. రూ.లక్ష లోపు పనులకు నిర్వహించిన 14 అంశాలకు టెండర్లు వేయగా 11 అంశాలకు టెండర్లు ఖరారు కాగా, మూడు టెండర్లు వాయిదాపడ్డాయి. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఉంగటి పాపారావు తదితరులు పాల్గొన్నారు.

క్యాబిన్‌లో ఇరుక్కుని డ్రైవర్ నరకయాతన



వ్యాన్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన శ్యామలరావు

రణస్థలం: మండల కేంద్రం రణస్థలంలోని కొత్త పెట్రోల్ బంకు సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ డ్రైవర్ క్యాబిన్ ఇరుక్కుపోయి నరకయాతన అనుభవించాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నం వైపు నుంచి శ్రీకాకుళం వైపు వస్తున్న లగేజీ వ్యాన్ డ్రైవర్ ఎల్.శ్యామలరావు ముందు వెళుతున్న లారీ సడన్‌గా బ్రేక్ వేయడంతో బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వ్యాన్ క్యాబిన్‌లో శ్యామలరావు ఇరుక్కుపోయాడు. చాలా సేపు వరకు బయటకురాలేక నరయాతన పడ్డాడు. స్థానికులు అతికష్టమ్మీద బయటకు తీసి 108 అంబులెన్సులో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ప్రాణాపాయం తప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు. శ్యామలరావు స్వగ్రామం లావేరు మండలం అదపాక. జె.ఆర్.పురం పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

సాహిత్యమే ఊపిరిగా..

- రచనా రంగంలో రాణిస్తున్న ఉపాధ్యాయుడు కంచరాన భుజంగరావు
- ఇప్పటికే ఐదు కవితా సంకలనాల విడుదల
- 'గీసి చెరిపే బొమ్మ' పుస్తకావిష్కరణ నేడు



ప్రతిభా పురస్కారం అందుకుంటున్న కంచరాన భుజంగరావు(ఫైల్)

శ్రీకాకుళం కల్చరల్: ఓవైపు ఉపాధ్యాయ వృత్తి చేస్తూనే.. మరోవైపు రచనారంగంలో రాణిస్తున్నారు ప్రముఖ రచయిత కంచరాన భుజంగరావు. తెలుగు భాషాభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన భుజంగరావు స్వగ్రామం నందిగాం మండలం బడగాం. ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తూనే.. కవిత్వంలో తనదైన శైలిలో ఆకట్టుకుంటున్నారు. ఎన్నో కవితలు పలు పత్రికలు, మేగజీన్లలో ప్రచురితమయ్యాయి. తాను రాసిన కవితలతో ఇప్పటికే 5 సంకలనాలు తీసుకువచ్చారు. తెలుగు పద్య రచనపై ఉన్న అభిరుచితో రచనలు కొనసాగిస్తున్నారు. సాహిత్యం ఊపిరిగా, సమాజ సేవే ఆశయంగా సాహిత్య రంగంలో అనేక ప్రక్రియలు, రచనలు చేసి 'ప్రజాకవి'గా గుర్తింపు పొందారు.

రచనలు ఇవే..

సమాజంలో మార్పు కోరుతూ ఎక్కువగా రచనలు చేస్తుంటారు. రైతన్నల కోసం, కోవిడ్ కరోనాపైన, తూరుపు, సునామి ఓ సునామి వంటి కవితా సంకలనాలు వెలువరించారు. 150కిపైగా కవితలు వివిధ పత్రికలలో ప్రచురితమయ్యాయి. ఆల్ ఇండియా రేడియో, విశాఖపట్నం కేంద్రం నిర్వహిస్తున్న యువవాణిలో కథానికలు, కొన్ని కవితలు ప్రసారమయ్యాయి. అనేక వ్యాసాలు, సమీక్షలు, పాటలు ప్రాచుర్యం పొందాయి. 2005లో వలస పక్షుల విడిది– తేలినీలాపురం, 2010లో కొంగా! నాగోరు మీద పువ్వెయ్యవా (నానీ సంపుటి) ఆదరణ పొందాయి. 2023లో నీటిగింజల పంట (కవిత్వం) రచనకు గాను పల్లా కవితా పురస్కారం అందుకున్నారు. తాజాగా ఆయన కలం నుంచి జాలువారిన 'గీసి చెరిపే బొమ్మ (కవిత్వం) పుస్తకాన్ని చిగురుపల్లి ప్రభాకరరావు సౌజన్యంతో ప్రచురించారు.

అవార్డులు, సత్కారాలు..

సాహిత్యంలో కంచరాన కృషికి పలు సంస్థలు అవార్డులతో సత్కరించాయి. 2000లో పూర్వ విద్యార్థి సంఘం(బారువ) కవితా బహుమతి, 2001లో బి.ఎస్.శాస్త్రి బహుమానం, 2014లో పాలకొల్లులో కళాశయ కవితా పురస్కారం, 2016లో ఒంగోలు కళామిత్ర మండలి ప్రతిభా పురస్కారం, 2023లో గుంటూరుకు చెందిన రావి రంగారావు సాహిత్య పీఠం నుంచి నీటి గింజల పంటకు 'జనరంజక కవి ప్రతిభా పురస్కారం అందుకున్నారు.

29న పుస్తకావిష్కరణ

ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్, శ్రీకాకుళం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 29న బాపూజీ కళామందిర్‌లో రెండు పుస్తకావిష్కరణలు జరగనున్నాయి. అందులో కంచరాన భుజంగరావు రచించిన 'గీసి చెరిపే బొమ్మ(కవిత్వం), దివికుమార్ రచించిన 'ఉరికంబం సాక్షిగా' పుస్తకాల పరిచయాలు జరుగుతాయి.

ఊరు, గురువులే స్ఫూర్తి..



సాహిత్యమే శ్వాసగా ఉన్నాను. సాహిత్యంలో మరింతగా రాణించాలనుకుంటున్నాను. అక్షరాల వెలుగులేని ఇంటి నుంచి నేను కవిత్వంవైపు రావడానికి కారణం మా ఊరు, గురువులు. 2022లో సాక్షి దినపత్రికలో ప్రముఖ పాత్రికేయుడు ఎ.బి.కె.ప్రసాద్ రాసిన 'విన్నారా? మెదడే ప్రమాదకరమట' శీర్షికన ప్రచురితమైన వ్యాసం ముగింపులో నా కవిత 'సెల్ఫీకాదు' నుంచి పదిహేను పంక్తుల్ని ఉటంకించడం నా రాతల పట్ల విశ్వాసం పెరిగింది.

– కంచరాన భుజంగరావు, రచయిత

240 మద్యం బాటిళ్లు పట్టివేత

ఎచ్చెర్ల : లావేరు మండలం బుడుమూరు సంత వద్ద ఉన్న మద్యం దుకాణాల నుంచి అక్రమంగా తరలిస్తున్న 240 మద్యం బాటిళ్లను శనివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. బుడుమూరులో ఉన్న మద్యం దుకాణాల నుంచి నేదురుపేట, తామాడ గ్రామాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్టు దుకాణాలకు వీటిని తీసుకెళ్తుండగా పట్టుకున్నామని, ద్విచక్ర వాహనాలు, ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఏఎస్సై జగన్మోహనరావు కేసు నమోదు చేశారు. బెల్టుషాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ



ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

ఎచ్చెర్ల: మండలంలోని ధర్మవరం, పొన్నాడ గ్రామాల్లో ఎరువులు, పురుగు మందులు, విత్తనాల దుకాణాల్లో ఎచ్చెర్ల వ్యవసాయాధికారి వావిలాపల్లి రాజేశ్వరరావు శనివారం తనిఖీలు నిర్వహించారు. విక్రయదారులు రైతులకు కొనుగోలు మేరకు రశీదు అందించాలని సూచించారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విత్తనాలను నమూనాలను సేకరించి నాణ్యత పరీక్ష నిమిత్తం తాడేపల్లిగూడేంలోని రీజనల్ కోడింగ్ సెంటర్‌కు పంపించారు. తనిఖీల్లో విస్తరణాధికారి సీహెచ్ జగన్మోహనరావు పాల్గొన్నారు.


వర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్



పట్టా అందుకుంటున్న రామకృష్ణ

ఎచ్చెర్ల: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న గొద్దు రామకృష్ణకు కంప్యూటర్ సైన్స్‌లో డాక్టరేట్ పట్టా (పీహెచ్‌డీ) లభించింది. ఇటీవల మచిలీపట్నంలోని కృష్ణా విశ్వవిద్యాలయంలో జరిగిన స్నాతకోత్సవంలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.మధుమూర్తి, వైస్ చాన్సలర్ ఆచార్య కె.రాంజీ చేతులు మీదుగా డాక్టరేట్ అందుకున్నారు. రామకృష్ణ స్వగ్రామం కోటబొమ్మాళి మండలం చిన్నతుంబయ్యపేట. ఈ సందర్భంగా రామకృష్ణను వర్సిటీ సిబ్బంది, కుటుంబసభ్యులు అభినందించారు.

గ్రాడ్యుయేట్లు ఆవిష్కర్తలుగా ఎదగాలి



మాట్లాడుతున్న పల్సస్ సీఈవో గేదెల శ్రీనుబాబు

ఎచ్చెర్ల: గ్రాడ్యుయేట్లు ఉద్యోగాల కోసం కాకుండా ఆవిష్కర్తలుగా ఎదగాలని పల్సస్ గ్రూప్ సీఈవో, సైన్స్ టెక్నాలజీ వ్యవస్థాపకులు గేదెల శ్రీనుబాబు తెలిపారు. శనివారం ఎచ్చెర్లలోని వెంకటేశ్వర ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే వేడుకలో ఆయన మాట్లాడారు. ఔషధ, ఆరోగ్య సంరక్షణ రంగాల్లో శ్రీకాకుళం జిల్లా ఫార్మా ఇన్నోవేషన్ కారిడార్‌గా ఎదుగుతోందన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర ఎడ్యుకేషన్ సొసైటీ డైరెక్టర్లు డాక్టర్ బి.వి.ఎస్ఎన్ మూర్తి, ఎన్జకిషోర్, బి.ఎస్.రాజా, బి.రఘు కార్తీక్, బి.కృష్ణవంశీ, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.ఎస్ నాగోజీ, ఫార్మసీ విభాగాధిపతి భాను, అడ్మినిస్ట్రేటివ్ అధికారి తిరుపతిరావు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.